## సమస్యలను నా దృష్టికి తీసుకురావాలి



ముఖ్య కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

● మంత్రి జూపల్లి కృష్ణారావు

చిన్నంబావి, మార్చి 5 : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించుకుందామని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం పెద్దదగడలోని మంత్రి నివాసంలో మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల వారీగా పార్టీ నాయకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో నాయకులు నిస్వార్థంగా పనిచేయాలన్నారు. అనంతరం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, నాయకులు చిదంబర్‌రెడ్డి, రామచందర్ రెడ్డి, ఎన్నారై కొత్త కల్యాణ్‌కుమార్, కృష్ణ ప్రసాద్‌యాదవ్, బీచుపల్లియాదవ్, చంద్రశేఖర్‌యాదవ్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు పటిష్ట చర్యలు

● వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ రక్షితాకృష్ణమూర్తి

వనపర్తి, మార్చి 5 : జిల్లాలో యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణ, రోడ్డు భద్రతా నియమాలు అమలుపై ఎస్పీ రక్షితాకృష్ణమూర్తి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, రెవెన్యూ కలెక్టర్ నగేశ్, మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికుల ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎక్కడైనా గంజాయి సాగు చేస్తుంటే గుర్తించాలని సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత నషా ముక్త భారత్‌లో భాగంగా డీ అడిక్షన్ కేంద్రాలు, కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్పీ రక్షితాకృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల సరఫరా వినియోగ నియంత్రణలో ఉంటుందని, అయినప్పటికీ ఎప్పటికప్పుడు కళాశాలల్లో అవగాహన కల్పిస్తూ మెడికల్, బెల్ట్ షాపులపై నిఘా పెడుతూ యువతకు చెడు వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### రోడ్డు భద్రత నియామాలు పక్కాగా అమలు

జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా రహదారి భద్రతా నియామాలు పకడ్బందీగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సూచిక బోర్డులు, లైట్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం వంటి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మండలాల వారీగా ఎక్కడెక్కడ రోడ్డు ప్రమాదకరంగా ఉన్నాయో గుర్తించి జాబితా అందజేయాలని అర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ప్రమాదకర స్థలాల్ని గుర్తించేందుకు వారానికి రెండురోజులు కమిటీ సభ్యులను కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గతంలో కన్నా ప్రమాదాల రేటు తగ్గిందని దీనిని మరింత తగ్గించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమీక్షా సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్డీవో పద్మావతి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రష్మీ, జిల్లారోడ్డు భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ దేశ్యానాయక్, పంచాయతీ రాజ్ శాఖ ఈఈ మల్లయ్య, వనపర్తి మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్, ఆర్టీసీ డీఎం, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయిఅధి కారులతో మాట్లాడుతున్న వనపర్తికలె క్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ రక్షితామూర్తి

## తెలంగాణ ఆర్థికంగా బలమైన రాష్ట్రం

● మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి



మల్లాపురంఆ ంజనేయస్వామినిద ర్శించుకున్నకో ట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూర్, మార్చి 5: ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణ ఆర్థికంగా బలమైన రాష్ట్రమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం దివంగత కోట్ల విజయభాస్కర్‌రెడ్డి తనయుడు కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆత్మకూర్ సమీపంలోని మల్లాపురం ఆలయాన్ని సందర్శించి ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఏపీలో వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తున్న నేపథ్యంలో విజయం సాధించాలని ఆశిస్తూ స్వామి దీవేనల కోసం వచ్చినట్లు చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సొంత రాజధాని కల్గిన తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఈప్రాంతంలో కొన్ని పెండింగ్ ప్రాజెక్టులు ఉన్నాయని, అధికారంలోకి రాగానే తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సీఎంలతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంతకుముందు దేవాలయ ధర్మకర్త వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సిబ్బంది సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆయన తనయుడు కోట్ల రాఘువేంద్రరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రామలక్ష్మారెడ్డి, తులసిరాజ్, రెహమతుల్లా, శ్రీనివాసులు, అజ్మతుల్లా, గంగాధర్, శంషీర్, సాయి, రఘు ఉన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి,మార్చి 5 : వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ వీసీ ద్వారా తాగునీటి సరఫరాలపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, మిషన్ భగీరథ ఏఈలతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి స్థానికంగా ఉన్న బోర్లు, పంపు సెట్లు అన్ని మార్చి 15 లోగా మరమ్మతులు చేయించుకోవాలని ఆదేశించారు. నెలలో మూడుసార్లు ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయించాలని, నీళ్లు నింపిన ప్రతి సారి క్లోరినేషన్ విధిగా చేసుకోవాలని సూచించారు. వెబ్ కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈవో యాదయ్య, డీఆర్డీవో ఉమాదేవి, డీపీవో రమణామూర్తి, డీఎల్‌పీవో రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీలు, ఎంపీడీవోలు, ఏఈలు పాల్గొన్నారు.

### తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయాలి

పెబ్బేరు, మార్చి 5 : ఎండాకాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి రమణామూర్తి చెప్పారు. మంగళవారం పెబ్బేరు ఎంపీడీవో కార్యాలయంలో పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్షా సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేకంగా అన్ని గ్రామాల్లో హ్యాండ్ పంపుల రిపేర్లు, పైపు లైన్ల లీకేజీలు సరిచేయడం, మోటార్ల మరమ్మతులు పూర్తి చేయాలని అన్ని పంచాయతీలకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తి ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అలాగే, ఇంటి పన్నుల వసూళ్లను నూరు శాతం పూర్తి చేయాలని డీపీవో పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఎంపీవోలు రోజా, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నఅద నపుకలె క్టర్ సంచిత్ గంగ్వార్

## డీఈవోగా అదనపు బాధ్యతలు చేపట్టిన ఏసీ



అదనపుకలె క్టర్ అపూర్వ చౌహాన్

గద్వాల, మార్చి 5 : కలెక్టర్ ఆదేశాల మేరకు జోగుళాంబ గద్వాల జిల్లా విద్యాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ చేపట్టారు. ఇక్కడ డీఈవోగా పని చేస్తున్న సిరాజుద్దీన్ సెలవులపై వెళ్లగా ఇన్‌చార్జి డీఈవోగా కొన్నిరోజులు ఆదే శాఖలో ఏపీడీగా పని చేస్తున్న ఇందిరకు ఇచ్చారు. విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలనే ఉద్దేశంతో కలెక్టర్ అదనపు కలెక్టర్‌కు జిల్లా విద్యాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలో విద్యాశాఖ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. విధులను ఉపాధ్యాయులు ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. గట్టు మండలం నుంచి విద్యాశాఖలో ప్రక్షాళన చేపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా పాఠశాలల్లో బయోమెట్రిక్ విధానాన్ని తిరిగి అమలు చేస్తున్నామన్నారు. విడుతల వారీగా జిల్లా మొత్తం అమలు చేస్తామన్నారు.

## వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

గట్టు, మార్చి 5 : బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు మండలంలోని బలిగెర గ్రామానికి చెందిన నాగప్ప 55 ఏండ్లు, అదే గ్రామానికి చెందిన ఓ బాలిక తన తల్లి, సోదరుడిని ఆదివారం బస్టాండ్‌లో వదిలిపెట్టి వస్తుండగా మార్గమధ్యలో నాగప్ప అడ్డగించి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులతో చెప్పగా బాలిక తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై ఆదేశాల మేరకు నాగప్పపై కానిస్టేబుల్ వెంకటేశ్ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## భూమి కోతను అరికట్టాలి

ఇటిక్యాల, మార్చి 5: వ్యవసాయంపై ఆధారపడ్డ రైతులకు నేల ఆరోగ్యం అత్యంత ముఖ్యమైనదని, నేల కోతను అరికట్టేందుకు రైతులు కృషి చేయాలని చాగాపురం వ్యవసాయ విస్తరణ అధికారి భరత్‌సింహా సూచించారు. మండలంలోని బుడ్డారెడ్డిపల్లెలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించి నేలకోరి వేత వల్ల జరిగే నష్టాలను ఏఈవో తెలియజేశారు. నేల కోరి వేత అనేది అనేక సవాళ్లతో కూడుకున్నదైనా.. దానికి అనేక పరిష్కార మార్గాలు ఉన్నాయన్నారు. నేల కోరి వేత అరికట్టేందుకు బంజరు భూముల్లో చెట్లపెంపకం, వాలుకు అడ్డంగా పంటలసాగు చేపట్టడం, భూమిలో మైనింగ్ చేయకుండా ఉండడంతో చాలావరకు నేలకోరివేతను తగ్గించుకునే అవకాశముందన్నారు. నేలకోరి వేత అనేది సమిష్టిగా చేపట్టినప్పుడే ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## మౌన ధ్యానం విజయవంతం



మౌనధ్యానంలో పాల్గొన్న మహిళలు

వనపర్తి టౌన్, మార్చి 5 : జిల్లాకేంద్రంలోని వర్తక సంఘం అసోసియేషన్ భవనంలో మంగళవారం నిర్వహించిన ఒకరోజు మౌనధ్యానం విజయవంతమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి జిల్లా పిరమిడ్ సొసైటీ సమన్వయకర్త డాక్టర్ రామకృష్ణ హాజరై మాట్లాడారు. ధ్యానం ద్వారా మనలో నెగెటివ్ ఆలోచలు తగ్గి పాజిటివ్ ఆలోచనలు పెరుగుతాయన్నారు. మనసు ప్రశాంతమై చేసే పనిపై ఆసక్తి పెరుగుతుందని , సంకల్ప శక్తి, వాక్ శుద్ధి కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పిరమిడ్ సొసైటీ పట్టణ అధ్యక్షుడు ఉమేశ్‌గౌడ్, మాస్టర్లు సునీత, కమలమ్మ, సుగుణమ్మ, మహేశ్వరి, రాజ్‌కుమార్, రాములు ఉన్నారు.

## ప్రసవాల సంఖ్య పెంచాలి



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వోజ యచంద్రమోహన్

ఖిల్లాఘణపురం, మార్చి 5 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను మంగళవారం డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ తనిఖీ చేశారు. ముందుగా దవాఖానలోని ఓపీ, రోగుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడుతూ రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారికి కావాల్సిన వైద్యాన్ని అందించాలన్నారు. దవాఖానలో ప్రసవాల సంఖ్యను పెంచేలా చూడాలన్నారు. దవాఖాన ఆవరణ, గదులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్, నర్సింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూం పరిశీలన

అలంపూర్, మార్చి 5: ఎంపీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆర్డీవో రాంచందర్ అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో స్ట్రాంగ్ రూం, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మంజులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా ఎన్నికలకు సిద్ధం చేయాలని సూచించారు.

## పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

ధరూరు, మార్చి 5 : మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కారదర్శులు బదిలీ అయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను అలంపూర్, అయిజ, ఇటిక్యాల, రాజోళి, మానవపాడు, ఉండవెల్లి, గట్టు, కేటీదొడ్డి, మల్దకల్, గద్వాల మండలాలకు బదిలీ అయ్యారు. నలుగురు మాత్రమే ధరూరు మండలంలోని వివిధ గ్రామాలకు బదిలీ అయ్యారు

### మల్దకల్ మండలంలో..

మల్దకల్, మార్చి 5 : మల్దకల్ మండలంలో 25గ్రామ పంచాయతీలకు గానూ 25మంది పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ ఆదేశాల మేరకు బదిలీలు చేశారు. వీరి స్థానంలో కొత్తగా 25 మంది పంచాయతీ కార్యదర్శులు వచ్చినట్లు ఎంపీడీవో హరికృష్ణ తెలిపారు.

### ఉండవెల్లి మండలంలో..

ఉండవెల్లి, మార్చి 5: మండలంలోని 16 పంచాయతీల కార్యదర్శులు బదిలీ అయినట్లు ఎంపీడీవో జబ్బార్, ఎంపీవో పద్మావతి పేర్కొన్నారు. కార్యదర్శులు రాధ, దేవకీదేవి, ధనుంజయ్‌రెడ్డి, మహ్మద్ జుబేర్, రవి, జరీనా, జ్యోతి, శివశంకర్, నలేందర్, నాగరాజు, మహేశ్వరనాయుడు, శివశంకర్, కవిత, బాలకృష్ణ, అశోక్‌కుమార్ బదిలీ అయ్యారు.

### అయిజ మండలంలో..

అయిజ, మార్చి 5: మండలంలోని 28 పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తూ కలెక్టర్ సంతోష్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో 28 గ్రామ పంచాయతీలకు 28 కార్యదర్శులు ఉండగా, 27మందిని జిల్లాలోని ఇతర మండలాలకు బదిలీ చేయగా, పులికల్ కార్యదర్శిని అయిజ మండలంలోని మేడికొండకు బదిలీ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యదర్శులను రిలీవ్ చేయనున్నట్లు ఎంపీడీవో వెంకటయ్య తెలిపారు.

# మా ప్రజాప్రతినిధులజోలికొస్తే తీవ్రపరిణామాలు

● ఎంపీపీ రాజారెడ్డి, ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

గద్వాల, మార్చి 5 : బీఆర్ఎస్ ఎంపీటీసీలను బలవంతంగా కాంగ్రెస్ నాయకులు పార్టీ మారాలని ఒత్తిడి చేస్తున్నారని, తమ ప్రజాప్రతినిధుల జోలికి వస్తే గద్వాల కాంగ్రెస్ నాయకులు తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మల్దకల్ ఎంపీపీ రాజారెడ్డి, ఎమ్మెల్యే సతీమణి మాజీ సర్పంచ్ బండ్ల జ్యోతి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ ఎంపీటీసీలను మాట్లాడుదామని తీసుకెళ్లి మంత్రి జూపల్లి సమక్షంలో కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీ మారారని చెప్పడం సరైనది కాదన్నారు. ప్రజా క్షేత్రంలో గెలవలేక తమ పార్టీ ప్రజాప్రతినిధులను భయాందోళనకు గురిచేయడం, వారికి మాయ మాటలు చెప్పి బలవంతంగా కాంగ్రెస్ కండువాలు కప్పితే చూస్తు ఊర్కోమన్నారు. బలవంతగా కండువాలు కప్పి దానిని సోషల్ మీడియాలో కాంగ్రెస్‌లో చేరికలు జరుగుతున్నాయని అధిష్టానానికి చెప్పి వారి ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. అనంతరం కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న బీఆర్ఎస్ ఎంపీటీసీలు రాజు, జయమ్మా నర్సింహులు, సరోజమ్మామహేశ్ మాట్లాడుతూ సోమవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు మాతో మాట్లాడుదామని చెప్పి మాకు ఇష్టం లేకున్నా బలవంతంగా మంత్రి జూపల్లి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పారని ఇది సరైందని కాదని చెప్పినా వినలేదన్నారు. ఎప్పటికీ మేము గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అడుగు జాడల్లో నడుస్తామని చెప్పారు. ఇంకోసారి కాంగ్రెస్ నాయకులు మాదగ్గరికి వస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు.

### పంచాయతీ కార్యదర్శులకు బీఆర్ఎస్ మద్దతు..

జిల్లాలో జరిగిన గ్రామ పంచాయతీ కార్యదర్శుల బదిలీలు అనైతికంగా జరిగాయని వాటిని వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ నాయకులు రాజారెడ్డి, జ్యోతి, తిమ్మారెడ్డి డిమాండ్ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రత్యేక అవసరాలు ఉన్న మహిళలు, దివ్యాంగులను దూరంగా బదిలీ చేయడం సరైంది కాదన్నారు. బదిలీలను వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రికి వినతి పత్రం ద్వారా బదిలీల పద్ధతి మార్చాలని కోరినట్లు వారు చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రమేశ్‌రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, వెంకటన్న మధు పాల్గొన్నారు.



సొంతగూటికిచేరు కున్నఎం పీటీసీలు

## కూలీల సమస్యలను పరిష్కరించాలి

అమరచింత, మార్చి 5 : ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, మండల అధ్యక్షుడు శంకర్ కోరారు. మంగళవారం వారు మండలంలోని కొంకనోనిపల్లి గ్రామంలో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధి కూలీలు తదితరులు ఉన్నారు.

## బదిలీపై వెళ్లిన అధికారికి సన్మానం

వనపర్తి టౌన్, మార్చి 5 : జిల్లాకేంద్రంలోని సాంఘి సంక్షేమ శాఖలో పనిచేసిన అధికారి బానుప్రసాద్ మాతృ సంస్థ అయిన పంచాయతీరాజ్ శాఖకు బదిలీపై వెళ్లారు. మంగళవారం ఆయనను కలెక్టరేట్‌లో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ పీడీ మల్లికార్జున్, డిప్యూటీ సీఈవో రామ మహేశ్వర్‌రెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ అధికారిణి సుషిత, ఆర్టికల్చర్ అధికారి సురేశ్, బీసీ సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి, ఎస్టీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్, ఇతర శాఖల అధికారులు నాగేంద్రం, విశ్వేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

## ట్రాఫిక్ ఎస్సైగా బాలచంద్రుడు

గద్వాల అర్బన్, మార్చి 5 : గద్వాల ట్రాఫిక్ ఎస్సైగా బాలచంద్రుడిని నియమిస్తూ జిల్లా పోలీస్ అధికారులు అదేశాలు జారీ చేశారు. మంగళవారం గద్వాల ట్రాఫిక్ ఎస్సైగా బాలచంద్రుడు బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచి బదిలీపై వచ్చారు. ట్రాఫిక్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న విజయ్‌కుమార్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేశారు.

## పాఠశాలల పరిశీలన


పాన్‌గల్, మార్చి 5: మండలంలోని బుసిరెడ్డిపల్లి, రాయినిపల్లి ప్రాథమిక పాఠశాలలను ఎంపీడీవో కోటేశ్వర్, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతాన్ని పరిశీలించి, విద్యా సామర్థ్యాలను పరీక్షించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవుజ, నాగరాజు పాల్గొన్నారు.

## ప్రకృతి వనాలను కాపాడుకుందాం

అమరచింత, మార్చి 5 : పల్లెల్లో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలను ప్రతిఒక్కరం బాధ్యతతో కాపాడుకుందామని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఆయన జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ సమీపంలోని ఏర్పాటు చేసిన బృహత్ పల్లె ప్రకృతి వనం, సంపదవనాన్ని ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.

## ఉపాధిహామీ పనుల పరిశీలన

ఖిల్లాఘణపురం, మార్చి 5 : మండలంలోని అప్పారెడ్డి పల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీవో వెంకటాచారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఉపాధిహామీ పనులను ఉదయం నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించాలని, కూలీలకు పనుల వద్ద మంచినీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచేలా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు ఉన్నారు.



అప్పారెడ్డిపల్లిలోప నులనుప రిశీలిస్తున్నఎం పీడీవో

## పల్లెప్రకృతి వనం దగ్ధం



కాలిపోయిన ప్రకృతి వనం

అయిజ రూరల్, మార్చి 5: మండలంలోని సంకాపురం శివారులో ఉన్న పల్లెప్రకృతి వనానికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం పల్లె ప్రకృతివనంలోని మొక్కలకు ఆకస్మాత్తుగా నిప్పంటుకుంది. అటుగా వెళ్తున్న బాటసారులు గమనించి విషయాన్ని గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శికి తెలిపారు. అప్పటికే మొక్కలు కాలి బూడిదయ్యాయ. దీంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు.

## ఇంటర్ పరీక్షలకు 180మంది గైర్హాజరు

వనపర్తి టౌన్, మార్చి 5 : జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఇంటర్ సెకండియర్ పరీక్షలో 6,271 మంది విద్యార్థులకు గానూ 6,091 మంది హాజరు కాగా 180 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో మద్దిలేటి తెలిపారు. జనరల్ విభాగంలో 5,227 మంది విద్యార్థులకు గానూ 5,076 మంది హాజరు కాగా 151 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,044మందికి గానూ 1,015 మంది హాజరు కాగా 29 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 180 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసి సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయించినట్లు చెప్పారు.

## ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతికకా ర్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

అయిజ, మార్చి 5: పట్టణంలోని తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ప్రతి రోజూ రాత్రి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టేజీపై వివిధ పాఠశాలల చిన్నారులు ప్రదర్శిస్తున్న భక్తి, జానపద, భరత నాట్యం, సినీపాటలకు చక్కటి స్పందన వస్తున్నది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భగవద్గీతపై ప్రచారం

గోపాల్‌పేట, మార్చి 5 : మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని త్రైతసిద్ధాంతం–ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని తాడిపర్తిలో త్రైత సిద్ధాంత భగవద్గీత , అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులకు భగవద్గీత విశిష్టతను వివరిస్తూ, అందుకు సంబంధించిన పుస్తకాలను సరసమైన ధరలకు విక్రయించారు. ప్రచార కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వెంకట్రాములు సభ్యులు సురేశ్‌కుమార్, కృష్ణయ్య, నాగరత్నం, లలిత, బద్రీనాథ్, చింటూ, అమ్ములు, పద్మ ఉన్నారు.

## పౌష్టికాహారం అందజేత

ఖిల్లాఘణపురం, మార్చి 5: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు మంగళవారం ఎమ్మార్సీ ప్రత్యేకాధికారి అర్జున్ పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారంగా రాగిపిండి, బెల్లం పొడిని కలిపి అంబలిగా చేసి అందిస్తుందన్నారు. అందులో భాగంగానే మండలంలోని అన్ని పాఠశాలలకు రాగి పిండి, బెల్లంపొడిని పంపిణీ చేసినట్లు తెలిపారు.

# పని ప్రదేశాల్లో మహిళలకురక్షణకల్పించాలి

● ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ నరేంద్రకుమార్

వనపర్తి, మార్చి 5 : ప్రభుత్వ,ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ నరేంద్రకుమార్ అన్నారు. మంగళవారం వనపర్తి ప్రభుత్వ జనరల్ దవాఖానలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని 'శ్రామిక మహిళలకు ఎదురవుతున్న సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో నరేంద్రకుమార్ పాల్గొన్నారు. అంతకుముందు సీఎం చేతుల మీదుగా శ్రీపాదరావు స్మృతి అవార్డు అందుకున్న డాక్టర్ నరేంద్రకుమార్‌రెడ్డిని ఏఐటీయూసీ మెడికల్ యూనియన్ నేతలు ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రామిక కార్మికురాలను డాక్టర్ నరేంద్రకుమార్ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు శివప్రసాద్, ప్రభాకర్, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్,రమేశ్, కళావతి, ఇందిరా, శకుంతలమ్మ, ప్రమీల, కవిత, రాణి, శ్వేత, భాగ్యమ్మ, పద్మ, శ్రీను, నర్సింహ, మోహన్‌బాబు, సాయిబాబా, ఆంజనేయలు, రాము, శ్రీకాంత్, రాజేశ్‌కుమార్, మహేశ్ తదతరులు పాల్గొన్నారు.




కార్మికురాలినిస న్మానిస్తున్న సూపరింటెండెంట్‌న రేంద్రకుమార్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311802-All

**ప్రకటన**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794